క్లుప్తంగా

సీఎస్‌సీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి

కామేపల్లి: సీఎస్‌సీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని సీఎస్‌సీ కేంద్రాల తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ కె.సునీల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కామేపల్లి,తాళ్లగూడెంలోని సీఎస్‌సీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సెర్ప్ ద్వారా మహిళలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నామన్నారు. డిజిటల్ సేవలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని, కేంద్రాల నిర్వాహకులు వినియోగదారులకు ఉత్తమ సేవలను అందించాలని సూచించారు. మహిళాశక్తి ద్వారా మహిళలకు ఉత్తమ సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ సురేశ్, సీఎస్‌సీ కేంద్రాల నిర్వాహకులు సతీశ్, తెల్లబోయిన అరుణ తదితరులు పాల్గొన్నారు.

శిథిల ట్యాంకు కూల్చివేత

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకుని మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూల్చివేశారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సంయుక్త ఆధ్వర్యాన ప్రమాదకరం కాని పేలుడు పదార్థాలతో కూల్చి వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎంపీఓ పి.సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఖలీల్, పంచాయతీ కార్యదర్శి పి.సుజాత, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

ఖమ్మంక్రైం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఖమ్మం–1 పరిధిలో వివిధ గంజాయి, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాల వేలం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపారు. ఈ వేలం రెండోసారి నిర్వహిస్తున్నందున నిబంధనలకు లోబడి వేలం నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 11 గంటలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, ఖమ్మం–1లో హాజరు కావాలని సూచించారు.

రామాలయ వార్షికోత్సవం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో రామాలయ దేవాలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయ పూజారి గణపతిబొట్ల మధుసూదన్ శర్మ ఆధ్వర్యాన స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా.. గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకొని మేళ తాళాల మధ్య నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా గ్రామ దేవతలైనా బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి దేవాలయం వద్దకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రామాలయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించగా.. గ్రామంలో ఆధ్యాత్మికత శోభ సంతరించుకుంది.

‘బీమా’తో ఆర్థిక ధీమా..



సదస్సులో మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

- అవగాహన సదస్సులో మేయర్ నీరజ
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం
- వరదలను ఎదుర్కోవడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శలు
- పరిహారం అందలేదని మేయర్, అధికారుల ఎదుట బాధితుల ఆవేదన

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదలు, విపత్తుల నుంచి లోతట్టు ప్రాంతాల్లో ఆర్థిక నష్టాన్ని తగ్గించుకునేందుకు బీమా సౌకర్యాన్ని తీసుకోవాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. మంగళవారం స్థానిక నయాబజార్ కళాశాలలో 46, 47, 48 డివిజన్ల ప్రజలకు ఆస్తులకు ఇన్సూరెన్స్ చేయించడంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మేయర్ మాట్లాడారు. గతేడాది వచ్చిన వరదల సమయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్నేరు ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు తక్షణ సాయం కింద రూ.16,500 అందించారని తెలిపారు. ఈ ఏడాది వరదలను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక వరదలతో వాహనాలు, ఇళ్లు, వస్తువులు నష్టపోతే వాటికి ఇన్సూరెన్స్ ద్వారా సాయం అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మున్నేరు రక్షణ గోడల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.

ప్రభుత్వం విఫలం..

వరదల సమయంలో నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని స్థానిక బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో వరద సహాయక చర్యల కోసం ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను తీసుకొచ్చారని, సకాలంలో మనుషులను వరదల నుంచి బయటకు తీసుకొచ్చి పునరావాస కేంద్రాలకు తరలించారని మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ నేత తోట రామారావు విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు స్పందించి తమ ప్రభుత్వం వెంటనే స్పందించి వారం రోజుల్లోనే ముంపు ప్రాంతాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చిందన్నారు. ఇక స్థానికులు తమకు పరిహారం అందలేదని, ఒకే ఇంటిలోనే ఇద్దరు ముగ్గురికి సాయం అందించారని ఆరోపించారు. ఆర్థిక సాయం కోసం నెలల తరబడి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అవగాహన సదస్సులో గందరగోళం..

మున్నేరు లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే కుటుంబాలకు ఇన్సూరెన్స్ చేయించేందుకు కేఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కొంత గందరగోళం నెలకొంది. ఏఏ ఆస్తులకు ఇన్సూరెన్స్ చేస్తారు. ఏ డాక్యుమెంట్లు కావాలనేదానిపై బ్యాంకర్లు వివరించడంలో కొంత అయోమయానికి గురయ్యారు. అద్దె ఇళ్లల్లో ఉండే వారికి ఇన్సూరెన్స్ చేస్తారంటే ఒకరిద్దరు బ్యాంకర్లు సమాధానం చెప్పలేకపోయారు. అధికారులకే అవగాహన లేకపోతే తమకు ఎలా వివరిస్తారని స్థానిక ప్రజలు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అహ్మద్ షఫీ ఉల్లా, మెప్మా డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



పరిసరాలను పరిశీలిస్తున్న శ్రీజ, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ పి.శ్రీజ మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కేఎంసీ పరిధిలోని పశు వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశు వైద్యశాల ప్రధాన ద్వారం వద్ద, ఆస్పత్రి ఆవరణలో నీరు నిల్వ లేకుండా, రాకపోకలకు అంతరాయం లేకుండా అంతర్గత డ్రెయినేజీ లైన్లు నిర్మించాలని అధికారులకు సూచించారు. పెట్‌ల చికిత్స కోసం ఉన్న గదిలో ఆధునిక సదుపాయాలు కల్పించాలని, ఫ్యాన్లు, ఎల్‌ఈడీ లైట్లు, టేబుళ్లు, స్టూళ్లు అవసరమైన మేరకు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. శుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాలను కాపాడేందుకు రోజువారీ పర్యవేక్షణ కేటాయించాలన్నారు.

వినతుల వెల్లువ..

● కులవృత్తులను కాపాడాలి..



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న సంఘం నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: వృత్తి హక్కులు నాయీ బ్రాహ్మణులకే కేటాయించాలని, దీనికోసం ప్రత్యేక జీఓ జారీ చేయాలని ఖమ్మం నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈమేరకు బీసీ సంక్షేమశాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు యలమందల జగదీష్ మాట్లాడుతూ.. కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న తమకు కొన్ని కార్పొరేట్ శక్తులు తమ కులవృత్తులను కొల్లగొట్టి జీవనోపాధిని దెబ్బతీయాలని చూస్తున్నాయని ఆరోపించారు. తమ కులవృత్తి తమకే చెందేలా పేటెంట్ హక్కు కల్పించి వేల కుటుంబాలను కాపాడాలని కోరారు. వినతి అందించిన వారిలో నగర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కూసుమంచి: అర్హులైన తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ కూసుమంచిలోని ఎస్సీ కాలనీ (నేలకొండపల్లి రోడ్డు)కి చెందిన పలువురు మంగళవారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దళితులకు కేటాయించిన ఇళ్లలో మాలలకు అన్యాయం జరుగుతుందని, తమకు ఇళ్లు కట్టుకునేందుకు అర్హత ఉన్నా మంజూరు చేయలేదన్నారు. గత ప్రభుత్వంలోనూ తమకు అన్యాయమే జరిగిందని చెప్పగా.. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

● ఆరోగ్యబీమా కార్డులు జారీ చేయాలి

ఖమ్మంలీగల్: న్యాయవాదులుగా 2019 నుంచి ఎన్‌రోల్‌మెంట్ అయిన వారికి హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు జారీ చేయాలని ఖమ్మంకు చెందిన తాళ్లూరి దిలీప్‌చౌదరి కోరారు. ఈ సందర్భంగా ఆయన లా సెక్రటరీ రెండ్ల తిరుపతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అలాగే, ఢిల్లీకి సంబంధించిన హెల్త్ ఇండియా ఇన్సూరెన్స్ టీపీఏ సర్వీసెస్‌తో సంప్రదించి తెలంగాణ అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా కూడా రూ.5 లక్షల మెడిక్లెయిమ్ వర్తించేలా చూడాలని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



కామేపల్లి: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటేశ్వరరావు

నేలకొండపల్లి/కామేపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఏడీఏలు బి.సరిత, కొంగర వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన డీలర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సరిత, కామేపల్లి మండలం తాళ్లగూడెంలో వెంకటేశ్వరరావులు రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగహన కల్పించిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం నిషేధిత విత్తనాలను అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని, లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు, ఎరువులు కొని ప్రతీ ప్యాకెట్‌కు రశీదులు తీసుకుని భద్రపర్చుకోవాలని సూచించారు. అనంతరం వివిధ గ్రామాల్లోని దుకాణాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాధికారి ఎం.రాధ, డీలర్లు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గెల్లా వెంకటేశ్వరరావు, ఏఈఓలు అవినాష్, దుర్గాభవాని, శిరీష తదితరులు పాల్గొన్నారు. తాళ్లగూడెంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఏఓ తారాదేవి, నల్లమోతు లక్ష్మయ్య, మద్దినేని నరసింహారావు, నల్లమోతు రవి, రంగారావు, వెంకటనర్సయ్య, పుచ్చకాయల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

‘కగార్’ను నిలిపివేయాలి



నేలకొండపల్లిలో ర్యాలీ తీస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖనిజ సంపదను బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలు, మావోయిస్టులను హతమారుస్తున్నారని విమర్శించారు. ఈమేరకు జూన్ 14న హైదరాబాద్‌లో అఖిలపక్షం ఆధ్వర్యాన మహాధర్నా నిర్వహిస్తున్న తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, అచ్చ ఉప్పలయ్య, పేరం వెంకటేశ్వర్లు, నాగయ్య, చారి, శ్రీనివాసరెడ్డి, షబ్బీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లిలో అఖిలపక్షం ఆధ్వర్యాన పొట్టి శ్రీరాముల సెంటర్‌లో నిరసన ర్యాలీ చేపట్టారు. నాయకులు కర్నాటి భానుప్రసాద్, కే.వీ.రెడ్డి, పగిడికత్తుల నాగేశ్వరరావు, గుడవర్తి నాగేశ్వరరావు, పగిడికత్తుల రామదాసు, లెనిన్, కొండలరావు, వెంకటేశ్వరరావు, భాస్కర్‌రావు, నర్సయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులతోనే భవిష్యత్..

ప్రభుత్వ బడులతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతలను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



కూసుమంచి: ఉపాధి కూలీల వద్ద ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

దరఖాస్తుల వెల్లువ



మల్లేపల్లిలో దరఖాస్తులు అందిస్తున్న రైతులు

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి గ్రామ సభల్లో రైతుల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు అందుతున్నాయి. ఈనేపథ్యాన మంగళవారం రఘునాథపాలెం మండలంలోని మల్లేపల్లిలో నిర్వహించిన గ్రామసభలో 460 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ శ్వేత, ఆర్‌ఐ ప్రవీణ్ తెలిపారు. అలాగే పాపటపల్లిలో 120 దరఖాస్తులు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్, ఆర్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం నగరంలోని ఖానాపురంలో జరిగిన గ్రామ సభలో తహసీల్దార్ సైదులు, ఆర్‌ఐ సాయినరేష్‌లకు 33 మంది దరఖాస్తులు అందించ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగండ్లకోటి, దొంగల సత్యనారాయ, దండా జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రైవేట్’ దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

ఖమ్మంరూరల్: అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేసి కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పునుకుల సుధాకర్ అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఏడాది పరిమితికి మించి విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నా వాటిని అరికట్టంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. అక్రమ ఫీజుల వసూలు, అక్రమాలపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హరీష్, వరుణ్‌కుమార్, కృష్ణ, సాయి, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ మాట – అంగన్‌వాడీ బాట ప్రారంభం



రఘునాథపాలెం: మంచుకొండ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ప్రవేశ సంబరాలు



నేలకొండపల్లి: కోరట్లగూడెంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న టీచర్ నిర్మల



తిరుమలాయపాలెం: అంగన్‌వాడీ కేంద్రంలో ఎగ్ బిర్యానీ వడ్డిస్తున్న అంగన్‌వాడీ టీచర్ గీత

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి చిన్నారుల ప్రవేశాలను పెంచేందుకు ప్రభుత్వం మంగళవారం నుంచి 17 వరకు చిన్నారులను ఆకర్షించేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టింది. తొలి రోజు అంగన్‌వాడీ కేంద్రాలను అలంకరించి, తల్లిదండ్రులు, చిన్నారులకు స్వాగతం పలికారు. మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, 5 ఏళ్లు దాటిన చిన్నారులను పాఠశాలలో చేర్పించాలని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

వేపకుంట్లలో వైద్య శిబిరం

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామ పంచాయతీలో మంగళవారం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహం, రక్తపోటు వంటి అనారోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులతో పాటు డ్రైడే కార్యక్రమంలో భాగంగా గృహ సందర్శనలు చేపట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఆరోగ్య సహాయకులు మేడా పుష్పవతి, పెంటి కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి అనిల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .

ఉద్యోగులకు అండగా టీఎన్జీవోస్



సభ్యత్వం అందిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులకు టీఎన్జీవోస్ సంఘం అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాస్‌లు తెలిపారు. మంగళవారం జిల్లాలో ఇటీవల ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ శాఖల్లో నూతనంగా ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన 27 మందికి సభ్యత్వాన్ని అందించిన సందర్భంగా వారు మాట్లాడారు. టీఎన్జీవోస్ యూనియన్ ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన నిరంతరం పోరాడుతూ, సమస్యల పరిష్కారంలో ముందుంటుందన్నారు. నూతనంగా ఉద్యోగంలోకి వచ్చిన మీరు యూనియన్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. అనంతరం టీఎన్జీవోస్ అధ్యక్ష కార్యదర్శులను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం ఆధ్వర్యానఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, నాయకులు తిరుపతిరావు, ఎస్.విజయ, జి.కరుణాకర్, బాలాజీ, బాలు తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఆశయంతో ప్రారంభించిన వెల్‌నెస్ సెంటర్‌లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశపుల్లయ్య, రాయల రవికుమార్‌లు కోరారు. మంగళవారం వెల్‌నెస్‌సెంటర్‌ను సందర్శించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతిరోజు వందలాది మంది సెంటర్‌కు వస్తుండగా కావాల్సిన మందులు ఇవ్వటం లేదని, వేచిఉండేందుకు ప్రత్యేకంగా హాల్, కుర్చీలు కూడా లేవన్నారు. పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పివీరభద్రరావు, పీవీఆర్ కె.ప్రసాద్, కేవీ రమణారావు, కృష్ణయ్య, రామారావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ భరోసా అమలు చేయాలి



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఖమ్మంరూరల్: వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తున్నా కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రామ సభల ద్వారా వ్యవసాయ కార్మికులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కూలీలకు సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం అమలు చేయాలని, అమలులో ఉన్న కనీస వేతనం చట్టం అమలు చేసి వారికి న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి ఆర్.యాదగిరి, సంగిశెట్టి. వీరభద్రం, ఎడ్లపల్లి ఉపేందర్, బారి అఇంగయ్య, గుమ్మడి వీరబాబు, వెంకటేశ్వర్లు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో ‘అమ్మ పేరుతో ఒక మొక్క’



మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

తిరుమలాయపాలెం: ప్రధాని నరేంద్ర మోదీ 11ఏళ్ల పాలన సందర్భంగా తిరుమలాయపాలెంలో మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్ ఆధ్వర్యాన అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మొక్క నాటి కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను రాష్ట్ర కార్యవర్గం సభ్యులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాస్‌రెడ్డి, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీను, వీరభద్రం, భిక్షం, మధు, వెంకట్రాం, మల్లారెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విద్యార్థులపై ‘అమెరికాది అమానుష చర్య ’

ఖమ్మంమయూరిసెంటర్: చదువు కోసం, చిన్న కొలువు, ఉపాధి కోసం అమెరికా వెళ్లిన వారి పట్ల ఆ దేశ ఇమ్మిగ్రేషన్ అధికారులు అమానుషంగా వ్యవహరించడం సరికాదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. చేతులు వెనుకకు కట్టి, తొక్కిపెట్టి బలవంతంగా పశువుల మాదిరిగా పంపడాన్ని అమానుష చర్యగా పేర్కొన్నారు. కోటి ఆశలతో, పొట్ట చేత పట్టుకొని వెళ్లినవారు ఏజెంట్లు చేసే తప్పిదాలకు బలవుతున్నారు. దీనిపై ప్రధాని మోదీ కనీసం నిరసన తెలియజేయకపోవడం అన్యాయమని, ప్రజలు, దేశ గౌరవం కంటే మోదీ-ట్రంప్ మిత్రబంధం ఎక్కువగా చూడడం దేశ సార్వాభౌమాధికారానికి తీరని కళంకం అన్నారు.

మైనార్టీలకు తీరని అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న మగ్బూల్

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీలకు అన్యాయం జరుగుతోందని బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ మగ్బూల్ విమర్శించారు. మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీల అభ్యున్నతి కోసం వారికి కీలక పదవులు ఇవ్వాలని రాహుల్‌గాంధీ ఆదేశించినా.. సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అధిరారంలోకి రావడం కోసం మైనార్టీలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని ఒక్క ప్రయోజనం కూడా చేకూర్చలేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో నూతన షాదిఖానా కోసం భూమిని, నిధులను మంజూరు చేస్తే కక్షపూరితంగా ఆ పనులను నిలిపారన్నారు. అంతేకాక కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు మంత్రివర్గంలో చోటు దక్కలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, మైనార్టీ నాయకులు అబ్దుల్ ముజాహిద్, మహమ్మద్ రసూల్, సద్దాం షేక్, ఆసిఫ్, బురహాన్, నాగుల్ షరీఫ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

● పంచదార పంచలేక..



మండల లెవల్ స్టాక్ పాయింట్‌లో పాడైన పంచదార బస్తాలు

పేదలకు పంచాల్సిన పంచదార సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యంతో ఎందుకూ పనికిరాకుండా పోయింది. కరోనా సమయాన నేలకొండపల్లి సివిల్ సప్లై మండల లెవల్ స్టాక్ పాయింట్‌కు దాదాపు 100 క్వింటాళ్ల పంచదారను పంపించారు. నాటి నుంచి నేటి వరకూ పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేశారు. కనీసం పంచదార ఉన్న సంగతి కూడా ఉన్నతాధికారులకు తెలియనట్లుగా ఉంది. విపత్కర పరిస్థితుల్లో నిత్యావసరాల కోసం జనాలు ఇబ్బంది పడినా పట్టించుకోకుండా గోడౌన్‌లో పక్కన పడేయడంతో పలువురు మండిపడుతున్నారు. ఈ విషయమై స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

– నేలకొండపల్లి